# ఉపశాంతి

నల భీమ పాకంలో తయారైన పదార్థానికైనా ఆకలి వల్లనే రుచి పెరుగుతుంది. గోదావరీ జలాలకైనా దాహం వల్లనే రుచి కలుగుతుంది. అందుకు కారణం ఉపశాంతి! అదే మనిషికి ఎక్కువ ఆనందాన్ని ఇచ్చేది.

బంధుమిత్రుల ప్రేమాభిమానాలు కూడా అన్నపానాల్లాగే మనిషికి మిక్కిలి అవసరమైనవి. అయితే, ఈ విషయంలో కూడా ఆకలి, దాహం ఉండి, ఉపశాంతి కలిగితే

అద్భుతంగా ఉంటుంది. అందుకే ప్రతీ వ్యక్తికీ బంధుమిత్రుల ఎడబాటు చాలా అవసరం. ఆ ఎడబాటు అనంతరం కలిగే సంయోగం కలిగించే ఉపశాంతి రుచి వర్ణనాతీతం.

ఎడబాటు, సంయోగం... వీటిననుభవించబోతూన్న ఎంతోమంది ప్రయాణీకులనూ మోసుకుంటూ ట్రెయిన్ వేగంగా పరుగెడుతోంది. అదే ట్రెయిన్‌లో ప్రయాణం చేస్తూన్న రాజారావు గుండె కూడా వేగంగా కొట్టుకుంటోంది.

చాలాసేపటినుంచి ట్రెయిన్ వేగంగా పోతూనే ఉంది. కానీ రాజారావు గుండె వేగంగా కొట్టుకోవడం మటుకు సామర్లకోట దాటాకనే ఆరంభమయింది.

ఇక రాజమండ్రి చేరుకోవడానికి గంట కంటే పట్టదు.

మళ్ళీ రాజారావు గుండె వేగంగా కొట్టుకుంది.

చాలాకాలం తరువాత అతనికి బంధుదర్శనం కాబోతూంది. తల్లి, తండ్రి, అక్కలు, చెల్లెళ్లు, తమ్ముళ్లు...వీళ్లందరినీ చూసి రెండున్నర సంవత్సరాలైంది.

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితమే అతను ఉద్యోగంలో చేరాడు.

ఉద్యోగంలో చేరాక మొదటిసారిగా సెలవు మీద ఇంటికి వెడుతున్నాడు. ఇదివరలో ఇంటికి వెళ్లాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఏవో అవాంతరాలు వచ్చి కుదరలేదు. చివరకు ఇన్నాళ్ళకు...

ట్రెయిన్ కడియం దాటింది.

"లే...లే..." అన్నాడు రాజారావు భార్యను కుదుపుతూ.

"అబ్బ...మెలుకువగానే ఉన్నానండీ!" అంది, మూతలు పడిపోయిన కళ్ళను విప్పడానికి నానా అవస్థా పడుతూ వసుంధర.

"వచ్చేశాం...రాజమండ్రి...సరిగ్గా ఇంక పది నిమిషాలు" అన్నాడతను.

వసుంధరకు ఆటోమేటిక్‌గా కళ్లు విడివడ్డాయి. ఆమె మత్తు వదిలిపోయింది.

ట్రెయిన్ రాజమండ్రి స్టేషన్‌లో ఆగింది. రాజారావు కంపార్టు మెంటు కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు ఎవరి కోసమో వెదుకుతూ.

"అదిగో...అక్కయ్య!" అన్నాడు రాజారావు. అతని కళ్లు మిలమిలా మెరిశాయి. వసుంధర ఓసారి ముఖం చిట్లించింది.

"మామయ్యా, వచ్చేశావా?" అన్నాడు చంద్రం. చంద్రాన్ని చూస్తూనే వసుంధర ముఖం వికసించింది. "బాగున్నావా, చంద్రం?" అంటూ పలకరించింది. ఈలోగా అక్కయ్య పరివారంతో కంపార్టుమెంటులో ప్రవేశించేసింది.

రాజారావు అక్కయ్య పేరు నీలవేణి. ఆమె అతనికంటె పదేళ్ళు పెద్దది. ఆమెకు ముగ్గురు పిల్లలు. పెద్ద పిల్ల రాజేశ్వరికి పదహారేళ్ళు ఉంటాయి. రెండో వాడు చంద్రానికి పదమూడు నడుస్తున్నాయి. ఆఖరి వాడు రాంబాబుకి అయిదో ఏడు. నీలవేణి భర్త బ్రహ్మాజీరావు రాజమండ్రిలో పేరు ప్రఖ్యాతులు ఉన్న లాయరు.

''ఏరా...గుర్తుకొచ్చేమా?'' అంటూ పలకరించి, ''అరే! మీరెందుకు? మా నౌకర్లు తీసుకొస్తారు సామాన్లు. ఈ సీటు మీదున్నవేగా? ఇంకేమీ లేవుగా? ఇక నడవండి'' అని, ''ఒరే, చంద్రం, వాళ్ళిద్దరూ సామాన్లు తీసుకొస్తారుగానీ నువ్విక్కడ కాపలా ఉండు. ఆ మూడో వాణ్ణి కూడా తీసుకొద్దనుగానీ కారులో సీటు ఉండదని వదిలేశాను. నువ్వు కాస్త జాగ్రత్తగా నడవ్వమ్మోయ్, మరదలు పిల్లా, అసలే ఓపలేని మనిషివి'' అంటూ ముందు దారి తీసింది నీలవేణి.

''కారేమిటేవ్, అక్కయ్యా!'' అన్నాడు రాజారావు.

రాజారావు ఆ ప్రశ్న అడగాలనే అడిగాడని వసుంధరకు తెలుసు. అలా అడగడం ద్వారా నీలవేణి కి ఎంతో సంతోషం కలుగుతుంది.

నీలవేణిది అదొక రకం తరహా. ఆమెకు అతిశయం బాగా ఎక్కువ. ఎదుటి వారందరూ తన్ను గురించి చాలా గొప్పగా అనుకోవాలని ఆమెకు ఉంటుంది. తెలివితేటల్లో, అందంలో, ఐశ్వర్యంలో తన్ను మిం చిన వారు లేరని ఆమె అభిప్రాయం. అదే అభిప్రాయాన్ని అందరికీ కలిగించడానికి ఆమె వీలున్నప్పుడల్లా తాపత్రయపడుతుంది. అంతే కాదు, ఆమె సాధారణంగా ఐశ్వర్యవంతుల్నేగానీ గౌరవించదు. ఎటొచ్చీ ఆమెలో ఉన్న విశేషమల్లా బంధుప్రీతి. అక్కడ మాత్రం ఐశ్వర్యం అంతగా అడ్డు రాదు.

అప్పుడే వచ్చి అయిదు నిమిషాలు కాకుండానే...'తమకు ముగ్గురు నౌకర్లున్నారనీ, కారు కొన్నామని చెప్పడమయిపోయింది' అనుకుంది వసుంధర. ఇప్పుడా కారు గురించిన విశేషాలు చెప్పే అవకాశం రాజారావు ఇచ్చాడు. ఇంక ఆమె పురాణం విప్పుతుందేమోనని భయపడింది. కానీ...

''కారు కొన్నాంలే. రెండు నెల్లయింది. అవన్నీ కూర్చున్న తరువాత తీరుబడిగా మాట్లాడుకుందాం, పద. డ్రైవరు మళ్ళీ గోలెడతాడు. నాకింకా పూర్తిగా డ్రైవింగ్ రాలేదు. అంతవరకూ ఇలా పరాయి వాళ్ళ మీద ఆధారపడ్డం తప్పదు'' అంది నీలవేణి.

ఏడుగురు మనుషుల్నీ, సామాన్నీ మోస్తున్నా రంయ్‌న దూసుకుపోసాగింది కారు. కారులో నీలవేణి చెప్పడం మొదలుపెట్టింది: ''ఇరవై వేల చిల్లరయిందిరా.... దీని రంగు చూసి చుట్టుపక్కల వాళ్లంతా ఒకటే ఇదయిపోవడమనుకో. ఆయన పార్టీలో ఓ కంట్రాక్టరు న్నాడులే. ఇలాంటి కారు కోసమని మనసు పడిపోతున్నాడు. కానీ, అందరికీ ఆ అదృష్టం ఉండద్దూ! ముప్పై వేలయినా ఇచ్చి కొనేయడానికి సిద్ధంగా ఉన్నాడు. అదలాగుంచు. ఈ కారు డ్రైవ్ చేసిన ప్రతివాడూ ఇన్ని కార్లు డ్రైవ్ చేశాంగానీ ఈ కారంత బాగా ఏదీ నడవ లేదమ్మా... అని ఒకటే ఆశ్చర్యపోవడం..''

నీలవేణి కారు విశేషాన్ని గురించి చెప్పుకుపోతూంటే... ''ఎంత మంది డ్రైవర్లు మారారేమిటి?'' అంది వసుంధర మధ్యలో. నీలవేణి వసుంధర వంక ఓ సారి గుర్రుగా చూసింది. అంతలోనే నవ్వేసి,''ఓ నలుగురు దాకా మారారు'' అంటూ మళ్ళీ ఏవో చెప్పడం ప్రారంభించింది.

వసుంధర ఆలోచిస్తూంది. నీలవేణి దగ్గర పనిచేయడం అంత సులభం కాదు. నీలవేణి దృష్టి లో పనివాళ్ళు మనుష్యులు కారు. మనుషులలాగుండే ఒక ప్రత్యేమైన జాతి. వాళ్ళు మరీ సంతోషంగా ఉంటే ఆమెకు గిట్టదు. ఇంత డబ్బున్న నాకే లేని ఆనందం వీడికెలా వచ్చిందీ అని ఆశ్చర్యపోయి, " ఏం చూసుకుని ఆ మిడిసిపాటు?" అంటూ వాడి హృదయం నొచ్చుకునేలా మందలిస్తుంది. ఖరీదైన బట్టలు కట్టుకుంటే,"డబ్బంతా బట్టలకు తగలేయకపోతే కాస్త నిలవేసుకోరాదూ? ఎంత ఖరీదైన బట్టలేసుకున్నా నువ్వు మా నౌకరువే కదా!"అనేస్తుంది. చిరిగిన బట్టలు కట్టుకుంటే, "ముప్పొటలా మా దగ్గరే మెక్కుతూ, ముప్పై రూపాయల జీతం పుచ్చుకుంటున్నా హీన్యమోడిపోవడం తగ్గదా నాయనా!" అంటుంది. అందువల్ల ఆత్మాభిమానమున్న వాడెవడూ ఆమె వద్ద ఎక్కువ కాలం పనిచేయలేడు. డబ్బే ప్రధానమనుకుని ఆమె అన్నదానికల్లా తందానతాన పాడగలిగేవాడామె వద్ద పని చేయగలడమోగానీ, ఇంతవరకూఎవరూ కూడా ఆమె వద్ద రెండేళ్లకు మించి పనిచేయలేదు.

కారు ఆగింది నీలవేణి ఇంటి వద్ద.

కారు దిగుతూ రాజారావు ఇంటివంక ఆశ్చర్యంగా చూశాడు. రెండున్నర సంవత్సరాల క్రితం అతను చూసిన ఇంటికీ, ఈ ఇంటికీ ఏమీ పోలిక లేదు.

"అలా నిలబడిపోయావేమిరా? ఇది మనిల్లే! ఏభై వేలు ఖర్చుపెట్టి ఫాషనబుల్‌గా రీమోడల్ చేయించాం. ఇంచుమించుగా విప్పేసి మళ్ళీ కట్టినట్లయిందనుకో. ఈ ఊళ్లో ఇంత ఫాషనబుల్ హౌస్ మరొకటి లేదు. ఇంతకంటే ఖరీదైన ఇళ్ళున్నాయిగానీ, దీనికున్న అందం వేటికీ రాదని ఆ మధ్య మా ఇంటికొచ్చిన ఓ ఇన్‌స్పెక్టర్ అన్నాడు. ఆయనకి మీ బావ ఓ కేసులో చాలా సాయం చేశారులే".

"అదా సంగతీ!" అంటూ నవ్వింది వసుంధర.

నీలవేణి వసుంధర వంక చిరుకోపంగా చూసింది. వసుంధర నాలిక కరుచుకుని నీలవేణిని అనుసరిస్తూ ఇంట్లో ప్రవేశించింది.

నలుగుర్నీ అవలీలగా హేళన చేయగల నీలవేణి తన్ను గురించిన ఒక్క సరదా విసురు కూడా భరించలేదు. ఆమె తన సంసారం చుట్టూ ఓ వలయం గీసుకుంది.అక్కణ్ణించే దూరంగా కనిపించే ప్రపంచాన్ని చూస్తూంటుంది. తన వలయంలోనిదే అత్యుత్తమమైనదీ, తక్కినదంతా సారవిహీనమైనదనీ ఆమె అనుకుంటూంటుంది. ఆమె దృష్టిలో డబ్బు సంపాదించడానికి అత్యుత్తమమైన మార్గం లాయరు ప్రాక్టీసు చేయడమే! మందులు, రోగులు, రోగాలతో కూడిన డాక్టరు వృత్తి - మోసాలు, బ్లాక్ మార్కెట్లూ, ఇన్‌కంటాక్స్ బాధలూ ఉన్న వ్యాపారం - వంతెనలూ, ప్రాజెక్టులూ, సిమెంటు బస్తాలూ, ఇరవై నాలుగ్గంటలూ బండచాకిరీ తో కూడిన ఇంజనీరు ఉద్యోగమూ.. ఇవన్నీ ఛీఛీ అంటూ హేళన చేస్తుందామె."మా ఆయనంటారా..ఆయన పూర్తిగా తెలివితేటల మీద ఆధారపడి, న్యాయం కోసం పోరాటం సాగిస్తున్నారు. కేవలం వాదనతో ఈ డబ్బు సంపాదిస్తున్నారు!"

అంటుంది. ఈ విషయంలో తర్కించడానికి ఆమె అంగీకరించదు. అసలేవిషయం లోనూ ఆమె తర్కాన్ని ఆమోదించదు. ఆమె అన్నదంటే అది వేదవాక్కు.

నీలవేణి ఓ చీర కొనుక్కుంటే అలాంటి చీర కొనుక్కోవడం కోసం ఆ ఊళ్ళోని ఫాషనబుల్ లేడీసందరూ ఎగబడతారు. నీలవేణి భవనం కడితే ఆ భవనాన్ని చూసి విశ్వకర్మ కూడా సిగ్గుతో తలవంచుకుంటాడు, అటువంటిది తను కట్టలేనని. ఆమె పెద్ద కూతురికి క్లాసులో ఆఖరి మార్కు వస్తే మేస్టర్లంతా ఆశ్చర్యంలో మునిగిపోగా, హెడ్మాస్టర్ స్వయంగా ఇంటికొచ్చి రాజేశ్వరిని పలకరించి, ''ఏమమ్మా,రాజేశ్వరీ, నీ ఒంట్లో బాగుడడం లేదా? లేకపోతే నీకాఖరి మార్కురావడమేమిటీ?'' అంటాడు. ఆ ఊళ్లో అందరాడవాళ్ళూ తమ భర్తలు నీలవేణి భర్తలా సంపాదించాలనీ, తాము నీలవేణి అంత తెలివిగా సంసారం చక్క దిద్దుకోవాలనీ, తమ పిల్లలు రూప గుణ సంపదలలో నీలవేణి పిల్లల్లా ఉండాలనీ అనుకుంటూంటారు.

ఆ రోజు భోజనానంతరం అరగంటసేపు గడిచిన సంభాషణలో వసుంధర, రాజారావులు గ్రహించిన విషయాలివి. వాళ్ళిద్దరే ముఖ్య శ్రోతలు, ఉపన్యాసకురాలైన నీలవేణి మధ్య మధ్యలో...''ఆ రోజు సుభద్రమ్మగారు మన సోఫా గురించిచేమన్నార్రా రాంబాబూ? నిన్న, వెంకట్రామయ్యగారు మన ఫ్రిజ్ గురించి ఏమన్నారే, రాజేశ్వరీ?'' అని తన సంతానం వద్ద నుంచి సపోర్టు తీసుకుంటూ దంచేస్తోంది.

వసుంధర వింటోంది కానీ, ఉట్టి మనిషి కాకపోవడం వల్ల ఎక్కువ సేపు కూర్చోవడానికి ఇబ్బంది పడుతోంది. పడుకోవాలని ఉంది కానీ, ఆడపడుచు ఆలా ఆగకుండా ఏవేవో చెప్పేస్తూన్నప్పుడు మధ్యలో లేవడం మర్యాద కాదని ఊరుకుంది.

''డైనింగ్ టేబుల్ క్లీన్ చేసేశానమ్మా'' అంటూ వచ్చాడో నౌకరు కుర్రాడు. నీలవేణి స్వోత్కర్షను ఒక్క క్షణం ఆపి, ''రెండు నిమిషాల్లోనే టేబుల్ క్లీనయిపోయిందా! నీకెప్పుడూ పని బద్ధకం. ఏదో అయిందనిపించేయడం కాదు. ఎక్కడైనా అంటు కనిపించిందంటే వెంటనే పొమ్మంటాను''అని,''ఏమంత తొందర? మళ్ళీ కొత్త సినిమా ఏదైనా వచ్చిందా?'' అనడిగింది.

వాడు సిగ్గుపడుతూ, ఆత్మాభిమానం లేని నవ్వొకటి నవ్వి, ''లేదమ్మా, ఈ రోజు కొత్తగా చుట్టాలొచ్చేరు కదా, ఇంకేదైనా పనుంటే చేద్దామనీ'' అన్నాడు.

''ఏడిశావ్‌లే! దొంగ కబుర్లు మా బాగా నేర్చావుగానీ, నిజంగానే పనుంది. ఇప్పుడే ప్రయాణం చేసి వచ్చి విడిచిన బట్టలు స్టాండు మీద వేశారు. వాటిని మన వాషింగ్ మెషిన్‌లో ఉతికేయ్. వంటాయనతోటి ఐస్‌క్రీమ్ మిక్సూ, పాలూ, కలిపి ఫ్రిజిడైర్లో పెట్టమని చెప్పు. ఆ గదిలో మంచం మీద డన్‌లప్ మాట్రెస్ వెయ్యి. పక్కవేసేటప్పుడు దాని మీద నూనె మరకలూ అవీ పడనీయకు. అయిదొందలు పై చిలుకెట్టి కొన్న వస్తువది'' అంటూ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చింది. ఇంట్లో ఉన్న కొన్ని ఖరీదైన సామానుల లిస్టు ఇచ్చే అవకాశం కలిగించినందుకు వాడి మీద ఆమెకు అభిమానం కూడా కలిగి, ''పనులయ్యాక డబ్బులిస్తాను..

ఈవేళేదైనా కొత్త సినిమా చూద్దువుగానిలే'' అంది. ''చిత్తమండి. అమ్మగారూ'' అంటూ వాడు వెళ్లిపోయాక ఆమె తన ఉపన్యాసాన్ని మళ్ళీ కొనసాగించింది.

మధ్యలో ''దాహమేస్తోందే'' అన్నాడు రాజారావు.''ఒరేయ్! ఆ ఫ్రిజ్ లోని మంచినీళ్లు ఇలా పట్రా'' అంటూ హుకుం జారీ చేసింది నీలవేణి. రాజారావు నీళ్ళు తాగాడు. నీళ్లు చల్లగానే ఉన్నాయి కానీ, ఆ చల్లదనంలో సహజత్వపు మాధుర్యం లేదు.

అక్కడ ఉన్న మూడు రోజులూ ముళ్ల మీద కూర్చున్నట్లే ఉంది వసుంధరకు. ఉన్న సదుపాయాలకూ, జరిగిన మర్యాదలకూ ఏమీ లోటు లేకపోయినా, ఒక రకమైన కృత్రిమమైన వాతావరణంలో ఉన్నట్లు అయిందామెకు. అదీగాక అన్నీ ఆమె భావాలకు వ్యతిరేకంగానే జరుగుతున్నాయక్కడ. ఉదాహరణకు అయిదేళ్ళ రాంబాబు నౌకర్ల మీద విరుచుకుపడ్డం ఆమెకు నచ్చలేదు. పనివాళ్ళు కూడా మనుషులే నని చిన్న పిల్లలు గుర్తించడానికి పెద్దవాళ్లు అవకాశమివ్వాలి. పనివాళ్ల మీద అథారిటీ చేసే అవకాశం పిల్లలకివ్వడం ద్వారా ఈ ఆశయం నెర వేరదు. అదీకాక పనివాళ్లు తప్పు చేసినా పెద్దవాళ్లు మందలిస్తే బాగుం టుంది కానీ, చిన్న పిల్లలు తిడితే, చూసేవాళ్లకు అసహ్యంగా ఉంటుంది.

రాజమండ్రిలో రావులపాలెం బస్సెక్కాక రాజారావు వసుంధరతో అన్నాడు: ''నువ్వీ మూడు రోజులూ ముళ్లమీదున్నట్లే ఉన్నావని నాకు తెలుసు, మా అక్క అభిప్రాయాలతో నేనూ ఏకీభవించనప్పటికీ ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకో, దానికి నేనంటే వెర్రి ఆపేక్ష..''

రావులపాలెంలో బస్‌స్టాండ్‌కి వచ్చి సిద్ధంగా ఉన్నాడు రాజారావు తమ్ముడు. మరిదిని చూస్తూనే వసుంధర ముఖం వికసించింది. వాళ్ళిద్దరిదీ మంచి దోస్తీ. ''ఏం వదినా, బాగున్నావా?'' అన్నాడు పెద్దమనిషి తరహాగా, చిన్న మరిది సుబ్బారావు.

''ఏం బాగులెద్దూ! నీలాగే ఉన్నాను'' అంది వసుంధర. సుబ్బారావు ఫోర్తు ఫారమ్ ఫెయిలయి మళ్ళీ చదువుతున్నాడు. వసుంధర కూడా తను చదువుకునే రోజుల్లో ఫోర్తు ఫారమ్ ఓ ఏడాది ఫెయిలు కావడం వల్ల అతన్నేడిపించడానికని అలాగంది. ఈ విషయం ఇదివరలో ఒకటి రెండు సార్లుత్తరంలో వ్రాయడం వల్ల సుబ్బారావుకి వెంటనే అర్థమయి ముఖం ముడుచుకున్నాడు.

''వచ్చారు.. అప్పుడే మొదలయింది'' అన్నాడు రాజారావు నవ్వుతూ. సామాను బస్‌లోంచి దింపి, రిక్షాలో ఊళ్లోకి బయలుదేరారు. సుబ్బారావు సైకిలు మీద వెనకాలే బయలుదేరాడు. పది నిమిషాల్లో అంతా ఇల్లు చేరుకున్నారు.

వసుంధర అత్తగారు పార్వతమ్మ వీధి గుమ్మంలోంచే నిలబడి చూస్తోంది. రిక్షా గుమ్మంలో ఆగగానే కోడలిని ఉద్దేశించి, ''అప్పుడే లోపలికి రాబోకమ్మా. అలా మెట్ల దగ్గరే నుంచో'' అంది. ఈలోగా సుబ్బారావు సైకిలు దిగి, స్టాండు వేసి సామాను దింపడంలో రిక్షా వాడికి సాయం చేశాడు. వసుంధర రిక్షా దిగి మెట్ల దగ్గిర నిలబడింది. రాజారావు రిక్షావాడికి డబ్బులిచ్చేశాడు. పార్వతమ్మగారు హడావుడిగా లోపలకు పరుగెత్తింది.

దిష్టి తీయించుకోవడానికి వసుంధరకేమీ అభ్యంతరం లేదు గానీ, వీధి మెట్ల దగ్గర అలా కొద్ది నిమిషాలసేపు నిలబడడం కొంచెం ఇబ్బందిగా ఉంది. అప్పుడే చుట్టుపక్కల ఒకళ్ళిద్దరు ఇళ్లలోంచి తొంగి చూడడాలు మొదలయ్యాయి. నీళ్ల బిందె పట్టుకెడుతూన్న ఒకావిడ పక్కావిడతో అంటూంది: "వెంకట్రామయ్యగారి కోడలొచ్చినట్లుంది"

ఏమైతేనేం, వసుంధర గృహప్రవేశం చేసింది. "మీకు నమ్మకాలున్నా, లేకపోయినా, పెద్దవాళ్లం మేమున్నతంత కాలం మేం చెప్పినట్లు చేయవలసిందే" అంది పార్వతమ్మగారు, దిష్టితీశాక. ఆవిడకు అలా అంటూండడం ఓ సరదా. ఇంట్లో ఆవిడ మాటకాదనే వారెవరూ లేరు. అయినా అలా అంటూంటుంది.

కొడుకులూ, కోడలూ నడవలో అడుగెట్టాక పక్క గదిలోంచి చదువుతూన్న భారత గ్రంథాన్ని మడిచి, "రాజిగాడొచ్చేశాడేమిటీ" అంటూ రంగంలోకి దిగారు వెంకట్రామయ్యగారు. రాజారావు తండ్రి వంక చూసి సిగ్గు పడుతూ నవ్వాడు. "కోడలు పిల్ల ఒంట్లో కులాసాగా ఉంటోందా" అనడిగారాయన. కొడుకూ, కోడలూ కూడా మాట్లాడకపోగా పార్వతమ్మగారే జవాబు చెప్పింది.

వసుంధర కిదొక తమాషా వాతావరణం. రాజారావు కిద్దరు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. వాళ్లంటే ఆమెకు చాలా సరదా. వాళ్లంతా చాలా సరదాగా కబుర్లు చెప్పుకుంటూంటారు. కానీ వాళ్లకాఅవకాశం పూర్తిగా చిక్కదు. ఈ కుర్రాళ్ల మధ్యకు పార్వతమ్మగారు వస్తూంటుంది. ఆవిడకీ వీళ్లతోపాటు కబుర్లు చెప్పాలని ఉంటుంది. కానీ రెండు తరాల మధ్య ఉండే భేదం వాళ్ల సంభాషణల్లోనూ ఉంటుంది.

"దొడ్లో తులసికోట ఉందా అక్కడ?" పార్వతమ్మగారి ప్రశ్న.

" లేదండీ," కోడలి జవాబు.

"ఎవర్నయినా అడిగి పాతుకోలేకపోయావా?"

"మాది మేడ మీది పోర్షనండీ."

"అయితేనేం? ఓ డబ్బాలో కాస్త మన్నేసుకుని ఓ తులసిమొక్క పాతుకోవచ్చుగా? అయినా రోజూ ఓ సారి తులసి మాతకు దండం పెట్టకుండా అన్నమెలా సాయిస్తుందర్రా మీకు... ఎంత చదువుకున్న వాళ్లయితే మాత్రం!" పార్వతమ్మగారి నిష్టూరం.

"తులసి వైద్యశాస్త్ర రీత్యా చాలా గొప్పది. దాన్ని పూజించమని మన పూర్వులూరికే అనలేదు" రాజారావు తల్లికి తందానతాన.

"బాగుందమ్మా! ఈ సారింటికెళ్లేటప్పుడు నేనిస్తాను. పట్టుకెళ్ళు. మీ శుభం కోరే చెబుతున్నాను. మీకు నమ్మకమున్నా, లేకపోయినా పెద్దవాళ్ళం మేమున్నంత కాలం మేం చెప్పినట్లుచేయవలసిందే".

వసుంధరకు నవ్వు వచ్చింది.నవ్వేసి, "అలా కితకితలు పెదతావేం?" అని ఆడ పడుచుమీద దెబ్బలాడింది."అయ్యో నేనెప్పుడు పెట్టాను!" అంది ఆడపడుచు సుభద్ర.

"చాల్లేవే ఆగడం! నువ్వు పెట్టందే అదెందుకంటుంది? అదసలే ఉత్తమనిషి కూడా కాదు. మోటు సరసాలాడకండి" అనేసింది పార్వతమ్మగారు. ఇదే సమయమనుకుని, "తప్పకుండా మీరిచ్చిన తులసి మొక్క తీసుకెడతానత్తయ్యా, మీ చేతుల్తో ఇస్తే మాకు శుభం కూడాను" అనేసింది వసుంధర.

పార్వతమ్మగారు సంబరపడి, అంతలో ఏదో పోపు మాడుతున్న వాసన రాగా వంటింట్లోకి వెళ్లిపోయింది.

"నీ అసాధ్యం కూలా! నీ మాత్రం కాకా తెలివి ఉంటే నాకు యూనివర్సిటీలోనే ఉద్యోగం దొరికి ఉండేది" అన్నాడు రాజారావు.

"కాకా తెలివే కాదు. ఏ తెలివి ఉన్నా దొరికేదేమో?"

సమాధానం దొరకనప్పుడు రాజారావు భార్యకేసి ఆశ్చర్యంగా, ప్రేమగా చూస్తాడు. ఆ చూపులకామె సిగ్గుపడిపోయి మరింక మాట్లాడదు. అదే ఆమెను లొంగదీసి మరికొంత సేపు పాటు అతన్నేమీ అనలేదు. ఈలోగా రాజారావు పుంజుకుంటాడు. ఇప్పుడు రాజారావు అదే చేయగా వసుంధర ఒక్క నిమిషం మాత్రమే సిగ్గుపడి,"మీ అన్నయ్యేడోయ్ కనబడడు?" అనడిగింది సుబ్బారావుని.

"భద్రంగారింటికెళ్లాడొదినా. వాళ్ల దొడ్లోచెట్టుని పనసపండొకటి పండిందట"

"పనసపండెందుకూ ఇప్పుడు?"

"ఎందుకంటావేమిటే! పనసతొనలు తింటే పనసతొనల్లాంటి బిడ్డలు పుడతా రంటారు. మీకు నమ్మకమున్నా, లేకపోయినా పెద్ద వాళ్లం...." వంటింట్లోంచి వచ్చిన పార్వ తమ్మగారి వాక్యం ఇంకా పూర్తి కాకుండానేమధ్యలో ఆపి,"బాబ్బాబు, నీకు పుణ్యముంటుంది! బిడ్డలు అనకు. బిడ్డ అను చాలు" అన్నాడు రాజారావు.

అంతలో మృత్యుంజయరావు పనసపండుతో ప్రవేశించాడు "అరే వదినొచ్చేసింది" అన్నాడు అన్ననూ, వదిననూ చూసి.

"ఏం నాయనా, కళ్లకువదినే కానీ అన్నయ్య కనబడ్డం లేదా" అన్నాడు రాజారావు దొంగ కోపంతో.

"వదిన్లోనేగాని మరి అన్నయ్యలో 'విశేషం' ఏం లేదు గదా! అందుకని వదినే కనిపిస్తుంది. అందుకే వదిన కోసమని స్పెషల్‌గా పనసపండు తెచ్చాం కూడా" అన్నాడు మృత్యుంజయరావు.

"నువ్వు నా కోసమని భద్రంగారింటికెళ్లేవా! నేన్నమ్మను" అంది వసుంధర.

"ఈ పనసపండే సాక్షి!" మృత్యుంజయరావు పైకెత్తి చూపించాడు.

"సాక్ష్యం సరేనోయ్! శ్యామల ఊళ్ళోనే ఉందిటగా మరి?"

మృత్యుంజయరావు సిగ్గుపడి పోయాడు. అతని బి.ఏ. ఆ ఏడాదే పూర్తి అయింది. యూనివర్సిటీ తెరవగానే ఎమ్.ఎ లో చేరాలని సంకల్పం. ఎమ్.ఎ. కాగానే అతనికీ,

శ్యామలకూ ముడిపెట్టాలని పెద్దల సంకల్పం. అతను సిగ్గుపడ్డానికి కారణం పెద్దల ఇష్టం అతనికీ ఇష్టమే కావడం.

"అదా సంగతి? అందుకే నన్ను వెళ్లద్దన్నాడు" అంది పెద్దాడ పడుచు సుమతి. పార్వతమ్మగారుమళ్ళీ వంటింట్లోకి పరుగెత్తింది ముసిముసిగా నవ్వుకుంటూ.

"ఇద్దరు మనుషుల తిండి తినాలమ్మోవ్" అంటూ కొసిరి కొసిరి వడ్డించింది పార్వతమ్మగారు కోడలికి భోజనాల దగ్గర. అవిణ్ణెలా ఒప్పించాలో తెలిసిన వసుంధర.."నేనెంత తింటానో మా అమ్మ కంటే కూడా మీకే బాగా తెలునుగదా? మీరేమో నాకు ముగురు మనుషుల తిండి వడ్డించారు. కొంచెం తీసేస్తాను మరి" అంది పార్వతమ్మ గారు ఒప్పుకోగా మళ్ళీ "కాకా తెలివి" అంటూ అస్పష్టంగా గొణిగాడు రాజారావు.

మేం చెప్పినట్లు వినవలసిందే నంటూ మధ్యాహ్నం పడుకోవడానికి వీల్లేదని కోడల్ని శాసించింది పార్వతమ్మగారు. కానీ మూడు దాటాక కోడలు కునుకు తీసినప్పుడావిడ "పోనీ! పడుకోనిద్దూ" అని ఊరుకుంది.

నిజానికి పార్వతమ్మగారు చండాశాసనురాలిగా శాసించినట్లు కనిపిస్తుంది కానీ, ఆవిడకే విషయంలోనూ పట్టింపు లేదు. ఉపన్యాసాల సమయాల్లో దేశ నాయకుల్లా అప్పుడప్పుడు ఉద్రేకపడి పోతూండడమూ, ఆచరణలో కూడా ఆ దేశ నాయకుల్లాగే ప్రవర్తిస్తూండడమూ ఆవిడ అలవాటు. ఎవరికైనా ఆవిడ ఏదైనా సలహా ఇచ్చినప్పుడు ఎదుటి వారు ఆ సలహా పాటిస్తున్నారా, లేదా అనే విషయం గురించి ఆవిడ ఏ మాత్రమూ పట్టించుకోదు. కేవలం తన పరిజ్ఞానాన్ని ప్రకటించడం కోస మే ఆవిడ సలహాలనిస్తూంటుంది. ఈ విషయం వసుంధరకు తెలుసు. అందుకే ఆమె ఆవిడ సలహాలనుఎంతో శ్రద్ధగా వింటు న్నట్లు నటించి, ఆవిడను పొగడ్తలతో ఉబ్బేసి, ఆ సలహాల నుంచి విముక్తి పొందుతూం టుంది. అత్తగారి ఈ అమాయకత్వం ఒకటి రెండు సార్లు వసుంధరకు చెరుపు చేసిందికూడా. ఓ సారి జ్వరం వచ్చినప్పుడు అత్తగారిని బెలిపించి, తినకూడనివి తిని మరో రెండు లంఖణాలకు పొడిగించుకుంది.

కొడుకు విషయంలో కూడా ఆవిడ ప్రవర్తన తమాషాగా ఉంటుంది. కాకరకాయ వేపుడు చేసి, " నీకిష్టమని చేశాన్రా" అంటుంది. ఆ వేపుడు చేసేటప్పుడు తనకాఉద్దేశ్యం లేకపోయినా వడ్డించేటప్పుడలాగనడం ఆవిడ కలవాటు. నిజానికి రాజారావుకు కాకరకాయ వేపుడు సహించదు. "అదేమిటే, అమ్మా! అది నేను తినను గదా" అంటాడతను."మరి చిన్నప్పుడు తినేవాడివికదురా" అంటుందావిడ."ఇది మరీ బాగుంది. నాకు సహించదని దొడ్లో కాకర పాదు పీకేసినందుకు నన్ను కొట్టడానికి కూడా సిద్ధపడ్డావోసారి నా చిన్నప్పుడు...గుర్తు లేదూ?"

"అయ్యో...నిజమేరా! రాకరాక వస్తే బిడ్డ కిష్టమైనది చేసి పెట్టలేకపోయాను. వెధవ మతిమరుపు!" ఆ బాధ ఆవిడ మనసులోంచీ రాదు. అలవాటైన వాక్యమది ఆవిడకు. అలా అన్నాక తన మతిమరుపు గురించి ఓ పావుగంట లెక్చరిస్తుంది.

కొడుకంటే ఆవిడకు చాలా ఇష్టమే అయినా, మాటల మీదున్న దృష్టి చేతల మీద లేకపోవడంవల్ల, ఆవిడ సక్రమంగా ఎన్నడూ కొడుక్కి చేసిపెట్టలేదు. చిన్నప్పటి నుంచీ అలా అలవాటు పడ్డ రాజారావుకి కూడా తల్లి అలా ప్రవర్తిస్తేనే తృప్తిగా ఉంటుంది. మరోలా ప్రవర్తించినా అతనికి అంత తృప్తిగా ఉండదు.

రావులపాలెంలో వారం రోజులు గడిపాక రాజారావు తల్లితో అన్నాడుః“రెండు రోజుల్లో మా అత్తగారిక్కడికి కావిడివ్వడానికి వస్తానన్నారు గదా? ఈ లోగా మేమోసారి అమలాపురంలో చిన్నక్కింటికి వెళ్లొచ్చేస్తామే.”

“నువ్వెడితే వెళ్లావుగాని, ఓపలేని పిల్ల... దాన్ని మాత్రం తీసుకెళ్లద్దు. ఏదో పెద్దదాన్ని చెబుతున్నాను....”

“మరి మేమిద్దరమూ కలిసి పెద్దక్కింటికి వెళ్లాంగదా? ఒక్కణ్ణే వెడితే చిన్నక్క బాధపడదూ? పేదవాళ్లమని మా ఇంటికి తీసుకురాలేదా అంటుంది!”

“అవుననుకో. కానీ మరి...?”

“నీకెందుకమ్మా...నే జాగ్రత్తగా తీసుకెడతాగా”

మొత్తం మీద పార్వతమ్మగారు అంగీకరించింది. ఆవిడ అంగీకరిస్తుందా, అంగీకరించదా అన్నది సమస్య కాదు. ఎంతసేపట్లో అంగీకరిస్తుందీ అన్నదే సమస్య.

బయలుదేరే ముందు రాకూడని శకునం వచ్చినందుకు రాజారావు దంపతులు (నమ్మకమున్నా, లేకపోయినా పెద్దవాళ్ళు చెప్పిన ప్రకారం) లోపలికెళ్లి, కాళ్ళు కడుక్కుని మంచి నీళ్లు తాగి మళ్లీ బయలు దేరారు. వాళ్లు తాగిన ఆ మంచినీళ్లు తియ్యగా ఉన్నాయి కానీ, చల్లగా మాత్రం లేవు. అవి బిందెలోంచి తేబడిన నీళ్లు.

అమలాపురం బస్సులో ఎక్కాక వసుంధర అంది: “మీ అమ్మగారికి మనమంటే చాలా అభిమానముంది కానీ, ఏమైనా ఆవిడ కొంచెం మారాలేమో కదూ?” అమె చెప్ప దలుచుకున్నది అతనికి తెలుసు. కానీ ఏ కొడుకూ తన తల్లి గురించి విమర్శనాత్మకంగా ఆలోచించడానికి అంగీకరించడు - అదీ భార్య ముందు. అతనామెను మారుమాటలతో మరిపించేసి, “మనుషుల తీరెలాగున్నా వాళ్లకు మనమీద అభిమానం.. అదీ నిష్కల్మషమైనది ఉండడమే ముఖ్యం సుమా!” అని అన్నాడు.

రాజారావు చిన్నక్క అతనికంటే రెండేళ్ళు పెద్దది. పేరు శకుంతల. మంచి ఆస్తిపరుడైన, అమలాపురంలో స్కూలు మాస్టారు ఉద్యోగం చేస్తున్న శంకర్రావుకామెనిచ్చి వివాహం చేశారు. అయితే శంకర్రావు తండ్రి చాలా దుబారా మనిషనీ, ఆస్తికి మించిన అప్పు చేశాడనీ తెలిసేసరికి చేతులు కాలిపోయాయి. ప్రస్తుతం శంకర్రావు అమలాపురంలోనే స్వంత ఇంట్లో ఉంటున్నాడు. సెంటు భూమి లేదు. మాస్టరీయే ఆధారం. అభిమానధనుడు. నలుగురు పిల్లలు. శకుంతల చాలా పొదుపరి అయినప్పటికీ, వాళ్ల పూర్వపు వాసనల వల్ల అప్పుడప్పుడు అప్పులు చేయవలసి వస్తూంటుంది. ఒక విధంగా వాళ్లు ఓ మాదిరి పేదరికం అనుభవిస్తున్నారనే ఒప్పుకోవాలి. అదృష్టవశాత్తూ శకుంతల మొదటి ముగ్గురు పిల్లలూ మగ వాళ్ళే. పెద్దవాడు ఫోర్తు ఫారమ్ చదువుతున్నాడు.

రాజారావూ, వసుంధరా గుమ్మంలో అడుగు పెట్టేసరికి నడవలో చాపమీద కూర్చుని పత్రికలో కార్టూన్లు చూస్తూన్న శంకర్రావు దంపతులు కనపడ్డారు. నీళ్ళిద్దర్నీ చూస్తూనే వాళ్లిద్దరూ తడబడి, దూరంగా జరిగారు "రాజిగాడండీ" అంది శకుంతల.

రాజారావు పరీక్షగా అక్క వంక చూశాడు. అక్క కళ్ళు మెరుస్తున్నాయి. ముఖంలో ఆనందం వెలుగుతోంది. అది కేవలం తన్ను చూడడం వల్లనే అని అతనెవరితోనైనా పందెం కట్టగలడు.

వసుంధర ఇంటినీ, పరిసరాలనూ, వ్యక్తుల తీరునూ చూస్తోంది. ఇదే మొదటిసారి ఆమె ఇక్కడకు రావడం. ఇల్లు బీదగా ఉన్నా నీటుగా ఉంది. మనుషులు పేదగా ఉన్నా హుందాగా ఉన్నారు. ఇంట్లోనూ, మనుషుల్లోనూ కూడా ఒక కళ ఉంది. అది జీవకళ.

"ఏమమ్మా, మరదలా, అమ్మా నాన్నల కోసం బెంగెట్టుకున్నావేమిటి? మరీ చిక్కి పోయావు" అంటూ శకుంతల వసుంధరను సమీపించి ఆప్యాయంగా తాకి, చేతులు పట్టుకుని లోపలకు తీసుకువెళ్లింది. రాజారావు నడవలోనే బావగారి దగ్గర చతికిలపడ్డాడు.

"మంచినీళ్ళు కావాలిరా?" లోపల నుంచి శకుంతల కేకేసింది.

"అక్కర్లేదే" అని అరిచి, "పిల్లలు కనబడరేమండీ, బావగారూ?" అంటూ బావగారిని ప్రశ్నించాడు రాజారావు.

'ఆడుకోవడానికి పోయినట్లున్నారు. సెలవులుగదా ఇప్పుడు? జ్యోతేమో నిద్దరోతోంది.'

వంటింట్లో కుంపట్లో బొగ్గుల్ని రాజేస్తూ, ఆడవాళ్ళు అడిగి తెలుసుకోవలసిన ప్రశ్నలడిగింది శకుంతల వసుంధరను. డాక్టరులా ఓసారి ఆమె ఒడలంతా తడిమి చూసి, కుంపటి మీద బూర్లెమూకుడు పెట్టింది. అంతలోనే హఠాత్తుగా, "ఒరే, రాజిగా" అని కేకేట్టింది.

"వస్తున్నా" అంటూ రాజారావు పరుగెత్తుకొచ్చాడు.

"కబుర్లాడడానికి నీకూ, బావకూ విశేషాలేముంటాయి గానీ ఆ పడక్కుర్చీ కాస్త ఇక్కడ వేయి. ఓపలేని పిల్ల ఎంతసేపని కూర్చుంటుంది?" అంది. రాజారావు కుర్చీ కోసం పరుగెత్తాడు.

వసుంధరకు ఆశ్చర్యంగా ఉంది. తనెప్పుడూ ఇక్కడికి రాలేదు కానీ, ఇది కొత్త ఇల్లులా అనిపించడం లేదు. తన భర్త రాజారావును ఇంత చనువుగా ఇంతవరకూ వాళ్లమ్మ గారు కూడా అజ్ఞాపించలేదు. గంటలతరబడి సోఫాలో కూర్చుని మాట్లాడినా నీలవేణికి తట్టని విషయం శకుంతలకు కొద్దిక్షణాల్లో తట్టింది.

రాజారావు కుర్చీ పట్టుకు వచ్చాడు. వసుంధర మొహమాటపడుతూనే అందులో కూర్చుంది.

"వీడికి నా వంటంటే చాలా ఇష్టం, ముఖ్యంగా నేను పెసరట్లు చేస్తే చాలా బాగుంటాయంటాడు. పెసరట్లు అంత వెంట వెంటనే అయే టిఫిన్‌కాదు కాబట్టి ప్రస్తుతానికి

ఉప్మా చేస్తాను. రాత్రికి పొటోళీ, కందిపచ్చడి, ఉల్లిపాయల పులుసు, రేపు ఉదయం పెసరట్లు, సరా?''

వసుంధర ఆశ్చర్యంగా వింటూంది. తల్లికి కూడా గుర్తులేని రాజారావు కిష్టమైన వంటకాలు శకుంతలకు గుర్తున్నాయి.

నిజంగానే శకుంతల చేతి ఉప్మా అద్భుతంగా తయారయింది.

పెందరాళే భోజనాలు చేసి అందరూ మొదటాట సినిమా చూశారు.

శకుంతల పిల్లలు కూడా మంచి ప్రవర్తన కలిగి ఉండటం వసుంధర కానందాన్ని కలిగించింది. వాళ్ళు రాజారావుని ఒక్క క్షణం కూడా వదిలి పెట్టలేదు. ఆఖరిపిల్ల జ్యోతి ఇదివరలో రాజారావును చూసి ఉండలేదు. కానీ మిగతావాళ్లను చూసి ఆ పిల్లకూడా అతనితో చనువుగా కబుర్లు చెప్పింది.

సినిమా నుంచి ఇంటికొచ్చాక ఓ అరగంట సేపు అంతా కులాసాగా కబుర్లు చెప్పుకున్నారు. ఆ కబుర్లలోఎక్కడా అతిశయోక్తులు లేవు. ఒకళ్ళను గురించిన నింద లేదు,స్వోత్కర్ష లేదు. కేవలం కులాసా కబుర్లు. కబుర్ల అనంతరం దంపతులకు వేరే గదిలో పక్క ఏర్పాటు చేసింది శకుంతల.

''రేపే ప్రయాణమంటున్నారు మీరు. నాకు మటుక్కు మరో రెండు రోజులు ఉండాలనుందిక్కడ'' అంది ఆ రాత్రి వసుంధర. నిజానికి రాజారావుకీ ఇక్కడాహ్లాదంగానే ఉంది. కానీ అతనేమీ మాట్లాడలేదు. వసుంధరే మళ్లీ అంది:

''నేను మా పుట్టింటికి చేరేలోగా మూడు మజిలీలు చేశాను. మూడుచోట్లా మూడు రకాల మనస్తత్త్వాలు ఎదురయ్యాయి. అంతా నన్నభిమానించిన వాళ్లే. కానీ నాకిక్క డున్నంత హాయిగా మరెక్కడా లేదు. కారణమేమంటారు?''

''మనస్ఫూర్తిగా ప్రేమిస్తూ మనిషిని మనిషిగా ఆదరించగల ప్రతివాళ్లూ మా శకుంతల అక్కలాగే ప్రవర్తిస్తారు. మా నీలవేణి అక్కకి ప్రేమ ఉంది కానీ, ఆదరణ ఆ ప్రేమ వల్ల వచ్చింది కాదు. దానికి నేనూ, ఇంటి కొచ్చే అతిథులూ ఆదరణ విషయంలో ఒక్కటే. తన గొప్పతనాన్ని ఆదరణలోచూపించాలనే తాపత్రయం దానిది. మా అమ్మకు నిష్కల మైన ప్రేమ ఉంది. ఆదరణ విషయం ఆమెకు పట్టనేపట్టదు. మా చిన్నక్క అంటావా? తన ఆదరణ మనమీద ఎటువంటి ప్రభావం చూపిస్తుందా అన్న ఆలోచనే దానికి లేదు. దానికి మనమీదున్న ప్రేమవల్ల అది ఆదరిస్తోంది. అంతే!''

మర్నాడు మధ్యాహ్నం మూడు గంటలకు రాజారావు, వసుంధర రావులపాలానికి తిరుగుముఖం పట్టారు. బయలుదేరే ముందు దాహం వేయగా శకుంతల ఇచ్చిన కుండ లోని నీరు తాగారు. ఆ నీరు చల్లగా, తియ్యగా ఉండి వాళ్లకు చక్కని దాహోపశాంతి కలి గించింది. ★

*(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక - 4-8-71)*